సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 1 । మార్చి । 2024



అంతా మా ఇష్టం..!

జిల్లాలో గుర్తింపు ఉన్న ప్రైవేటు స్కూళ్లు తమ వివరాలను సీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో పొందు పరచడం లేదు. 8లో



బ్లాక్ ఫిల్మ్‌లు తొలగించాల్సిందే..

వాహనాల ముందు, వెనుక, ఇరువైపులా అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌లు తొలగించాలని ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. 8లో

నృసింహ యజ్ఞం టికెట్ల విక్రయాలు ప్రారంభం



సింహగిరిపై ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు సుదర్శన నారసింహ మహాయజ్ఞం వైభవంగా నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. 8లో

కాపులంటే అంతులేని అభిమానం



భూమి పూజ చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి, అమర్‌నాథ్, ముత్తంశెట్టి



కాపు సామాజిక భవన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ, మేయర్ హరివెంకటకుమారి, పార్టీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

- అందుకే హైవే పక్కన అత్యంత విలువైన స్థలాన్ని సీఎం జగన్ కేటాయించారు
- కాపు, యాదవ సంఘ భవనాల నిర్మాణానికి రూ.50 లక్షలు చొప్పున కేటాయిస్తా..
- వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి వెల్లడి
- ఎండాడలో కాపు సామాజిక భవన నిర్మాణానికి ఘనంగా భూమి పూజ

మధురవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాపుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఎండాడలో దిశ పోలీస్‌స్టేషన్ పక్కన కాపు సామాజిక భవనం నిర్మాణానికి గురువారం భూమి పూజ జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కాపుల చిరకాల కోరిక ఈ రోజు నెరవేరిందని, కాపుల పట్ల సీఎం జగన్‌కు ఉన్న అభిమానం వల్లే హైవేని అనుకుని అత్యంత విలువైన అర ఎకరా స్థలం కేటాయించారన్నారు. నిర్మాణ పనులు కూడా వెంటనే ప్రారంభించి.. త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కాపుల పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. పశ్చిమ నియోజకవర్గం పద్మనాభనగర్‌లో కూడా కాపు భవనానికి సీఎం జగన్ రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖలో మెజార్టీ కాపు, యాదవ సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు ఉన్నారని, వారిని గుర్తించి కాపు, యాదవ భవనాలకు 50 సెంట్ల చొప్పున స్థలం కేటాయించినట్లు చెప్పారు. ఈ రెండు భవనాల నిర్మాణానికి తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.50 లక్షలు చొప్పున నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కాపు నేస్తంతో పాటు పలు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.

రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ 30 ఏళ్ల కిందట కాపు సామాజికవర్గానికి కేటాయించిన 10 ఎకరాల స్థలాన్ని నిలబెట్టుకోలేకపోయామన్నారు. ఇప్పుడు అలా కాకుండా తక్షణమే నిర్మాణం పూర్తి చేసుకుందామన్నారు. అత్యంత విలువైన స్థలాన్ని సీఎం జగన్ కేటాయించారని ఆనందం వ్యక్తం చేశారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు మేలు చేసిన వారికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున 31 మంది కాపులు పోటీ చేసేందుకు సీఎం జగన్ అవకాశం కల్పించారని, ఆ 31 మందిలో 29 మంది విజయం సాధించారన్నారు. ఐదుగురు కాపులకు ముఖ్యమంత్రి కీలక మంత్రి పదవులు ఇచ్చారన్నారు. కాపుల ఆరాధ్య దైవం రంగాను చంపిన వారికి, ముద్రగడ పద్మనాభం లాంటి వారిని అవమానించిన వారికి మద్దతు చెబుతారో.. కాపులకు మేలు చేసిన వారికి అండగా ఉంటారో మీరే నిర్ణయించుకోవాలని అమర్‌నాథ్ అన్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిధులు వచ్చే లోపు తన నిధులతో నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ వెనుకబడిన కులాలు దేశానికి వెన్నెముక అని గుర్తించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కులగణన చేపట్టారన్నారు. తాను అందరికీ నిత్యం అందుబాటులో ఉంటానని, పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని కోరారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్, జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, పలువురు ప్రజా ప్రతినిధులు, కాపు నాయకులు ముత్తంశెట్టి నందేశ్‌బాబు, పీలా ఉమారాణి, బీఎస్ మూర్తి, తోట రాజీవ్, వంకాయల మారుతీ ప్రసాద్, తోట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనది లూటింగ్ టీం

వైఎస్సార్ సీపీపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేసిన విమర్శలను మీడియా ప్రస్తావించగా.. ప్రస్తుతం రాష్ట్రంలో క్లాస్ వార్ జరుగుతోందని వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. దోపిడీదారులు ఓ పక్క.. సామాన్యులకు మేలు చేసిన తాము ఓ పక్క ఉన్నామన్నారు. సినిమా డైలాగులు చెప్పడం వేరు.. వాస్తవాలు వేరన్నారు. వారిది లూటింగ్ టీం అని.. లూటీ చేసినందుకే చంద్రబాబు జైలుకు వెళ్లారని గుర్తు చేశారు.

విజయీభవ

- నేటి నుంచి ఇంటర్ ఫస్టియర్, రేపటి నుంచి సెకండ్ ఇయర్ పరీక్షలు
- హాజరుకానున్న 82,766 మంది విద్యార్థులు
- జిల్లాలో 93 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

హెల్ప్ లైన్ నంబర్
0891-2552854, 2567561

జూనియర్ కాలేజీలు	172
హాజరయ్యే విద్యార్థులు	
ఫస్టియర్	40,874
బాలురు	21,693
బాలికలు	19,181
పరీక్ష కేంద్రాలు	93

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. శుక్రవారం నుంచి మొదటి సంవత్సరం, శనివారం నుంచి రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభంకానున్నాయి. జిల్లాలో 172 జూనియర్ కాలేజీల నుంచి జనరల్, ఒకేషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఫస్టియర్ 40,874 మంది పరీక్షలు రాస్తుండగా వీరిలో బాలురు 21,693, బాలికలు 19,181 మంది ఉన్నారు. సెకండ్ ఈయర్ 36,652 మంది రెగ్యులర్‌గా, 5,240 మంది ప్రైవేట్‌గా పరీక్షలు రాస్తున్నారు. వీరిలో బాలురు 21,800 మంది, బాలికలు 20,092 మంది ఉన్నారు. జంబ్లింగ్ విధానంలో జరిగే పరీక్షలకు జిల్లాలో 93 కేంద్రాలను సిద్ధం చేశారు.

పరీక్ష కేంద్రాల్లో సకల సౌకర్యాలు

కేంద్రాల్లో విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. అన్ని కేంద్రాల వద్ద వైద్య సిబ్బందితో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద మహిళా పోలీసులు సైతం అందుబాటులో ఉండేలా విధులు కేటాయించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ కెమెరాలను ఆర్‌ఐవో కార్యాలయంతో పాటు, ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేశారు. వీటిని నిరంతరం పర్యవేక్షించేలా ప్రత్యేక సిబ్బందికి విధులు కేటాయించారు.

ఆర్‌ఐవో కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్

పరీక్షల విషయంలో తలెత్తే ఏదైనా ఇబ్బందులను పరిష్కరించేందుకు విశాఖపట్నం కేంద్రంగా ఆర్‌ఐవో కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు లేదా తల్లిదండ్రులు హెల్ప్‌లైన్ నంబర్ 0891-2552854, 2567561కు ఫోన్ చేస్తే, సమస్య పరిష్కరించేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు, ఇన్విజిలేషన్ సిబ్బంది కేంద్రాలకు సెల్‌ఫోన్లు తీసుకురావడానికి వీల్లేదు. కేంద్రాల్లో సత్వర కమ్యూనికేషన్ కోసం సీఎస్‌లకు ఈసారి ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి కీప్యాడ్‌తో కూడిన సెల్‌ఫోన్లు అందజేసింది. వీటిని ట్రాకింగ్‌లో ఉంచారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగనుంది. ఒక్క నిమిషయం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించరు. విద్యార్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాల్లోకి తీసుకురాకూడదు.

ప్రత్యేక తనిఖీ బృందాలు

జిల్లాను ఆరు జోన్లుగా విభజించారు. పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా.. డిప్యూటీ తహసీల్దార్, ఏఎస్ఐ, సీనియర్ లెక్చరర్‌తో కూడిన ప్రత్యేక తనిఖీ బృందాలను సిద్ధం చేశారు. ప్రతీ 20 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసేలా ఐదు ఫ్లైయింగ్ స్క్వాడ్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల సంఖ్య 7 వందల మంది కంటే ఎక్కువగా ఉన్న 9 కేంద్రాలు, మార్కెట్ కాంప్లెక్స్ సమీపంలోని 3 పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.



బీవీకే కాలేజీలో సీటింగ్ ఏర్పాటు చేస్తున్న సీఎస్, డీవో, ప్రిన్సిపాల్

సమన్వయంతో విజయవంతం చేస్తాం



ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. కేంద్రాల్లో విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించాం. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. కలెక్టర్, జేసీ సూచనలకు అనుగుణంగా పోలీసు, రెవెన్యూ, వైద్య, పోస్టల్ శాఖల సమన్వయంతో పరీక్షల విజయవంతానికి కృషి చేస్తున్నాం. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా ప్రతీ ఒక్కరూ సహకరించాలి. – పి.మురళీధర్, ఆర్‌ఐవో, విశాఖ జిల్లా

నగరంలో విస్తృతంగా తనిఖీలు

పోలీస్ కమిషనర్ రవిశంకర్



మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో నగరంలో నమూలలా తనిఖీలు విస్తృతం చేయాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో పోలీసు ఉన్నతాధికారులు, లీగల్ అడ్వైజర్‌తో పాటు ఏడీసీపీలు నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ట్రాఫిక్, క్రైమ్, లా అండ్ ఆర్డర్, స్పెషల్ బ్రాంచ్ విభాగాల పనితీరును సమీక్షించారు. ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల పనితీరుపై ఆరా తీశారు. అక్రమ మద్యం, నగదు, ఇతర అనుమానిత వస్తువులను పూర్తిగా నివారించేలా అన్ని వాహనాలను నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

- అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లపై నిఘా ఉంచాలని సూచించారు.
- ఈ నెల లోక్ అదాలత్‌లో గతంలో కంటే ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- సీసీ కెమెరాలు ప్రతి స్టేషన్ హౌస్ ఆఫీసర్ తమ స్టేషన్ పరిధిలో అన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.
- నగరంలో అన్ని పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్న తీరు, అధికారులు ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరుపై ఆరా తీసి తగు ఆదేశాలు జారీ చేశారు.
- వుమెన్ సేఫ్టీకి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళలపై వేధింపులు, మహిళ మిస్సింగ్ సంబంధిత కేసుల్లో జాప్యం లేకుండా తక్షణమే స్పందించి ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో వారితో వ్యవహరించాలన్నారు. పోక్సో కేసులపైన సమీక్షించారు.
- నగరంలో క్రైమ్ రేట్ తగ్గు ముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలని సూచించారు. రాత్రి విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ ట్యాబ్ తీసుకొని, తమ లొకేషన్ తెలిసేలా ఉండాలన్నారు.
- ఎస్‌ఈబీ టీంలుగా ఏర్పడి నగరంలో ఉన్న విద్యా సంస్థలు వద్ద నిఘా పెట్టాలన్నారు. ప్రధాన ప్రాంతాల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు.
- సైబర్ క్రైమ్ మరింత బలోపేతం చేసే చర్యలపై చర్చించారు. పలు కొత్త సాఫ్ట్‌వేర్‌లను తీసుకొని వినియోగించాలన్నారు. సిబ్బందికి, అధికారులకు వాటిపై పూర్తి అవగాహనకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.
- పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసులు, అందుకు గల కారణాలు తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు.
- నగరంలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ముద్దాయిలపై ఉన్న ఎన్‌బీడబ్ల్యూ వారెంట్లను నిర్ణీత సమయంలో పూర్తిగా విచారణ చేసి వాటిని పరిష్కరించాలన్నారు.
- డయల్ యువర్ సీపీ, స్పందన, జగనన్నకు చెబుదాం, డయల్ 112లకు వచ్చిన ఫిర్యాదులను సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు, అధికారులు నిర్ణీత కాలంలో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఏయూతో ఆస్కా సంస్థ ఎంవోయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ప్రముఖ ఎన్‌జీవో సంస్థ ఆప్ సబ్ కీ ఆవాజ్(ఆస్కా) గురువారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పందపత్రాలపై రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆస్కా అధ్యక్షుడు శివ్ వడ్లమూడి సంతకాలు చేశారు. అవగాహన ఒప్పందంలో భాగంగా యువతను భాగస్వామ్యం చేస్తూ.. వారికి ఉపయుక్తంగా నిలిచే కార్యక్రమాలను ఆస్కా సంస్థ చేపడుతుంది. స్వచ్ఛంద రక్తదాన శిబిరాల నిర్వహణ, రక్తహీనతపై అవగాహన కల్పించడం, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వంటి వ్యాధుల పట్ల అవగాహన, ప్రత్యేకంగా దివ్యాంగ యువతకు అవసరమైన సహాయాన్ని అందిస్తుంది. కార్యక్రమంలో ఏయూ ఓఎస్డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆస్కా సహ వ్యవస్థాపకుడు, జనరల్ సెక్రటరీ బి.కిరణ్ కుమార్, ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ మహిళా విభాగం సమావేశం

కొమ్మాది: వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా మహిళా కమిటీ సభ్యుల సమావేశం శుక్రవారం జరగనుంది. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అద్దాల కృపాజ్యోతి ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా అద్దాల కృపాజ్యోతి మాట్లాడుతూ మధ్యాహ్నం 3.30గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, మహిళా విభాగం ప్రతినిధులంతా హాజరు కావాలని కోరారు.

టెట్‌కు 90.69 శాతం హాజరు

విశాఖ విద్య: టీచర్ ఎలిజిబిలిటీ పరీక్ష(టెట్–2024) మూడో రోజు గురువారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో ఆరు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం, సాయంత్రం రెండు సెషన్లుగా జరిగిన పరీక్షకు 4,224 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా 3,831 మంది హాజరయ్యారు. 90.69 శాతం హాజరు నమోదైంది.





అంతా మా ఇష్టం..!



నగరంలోని ఎన్ఏడీ శాంతినగర్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో సీబీఎస్సీ బోధన అమలు చేస్తున్నారనే క్రేజ్‌తో వేలాది రూపాయలు ఫీజు చెల్లించి తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పిస్తున్నారు. 2023-24లో ఇక్కడ ఏ ఒక్క విద్యార్థికి కూడా ఉచిత విద్యకు యాజమాన్యం అవకాశం కల్పించలేదు. తాజాగా 2024-25 విద్యా సంవత్సరానికి సీఎస్‌సీ వెబ్‌సైట్‌లో ఈ స్కూల్ పేరు కనిపించటం లేదు. ఇలాంటి స్కూళ్లు జిల్లాలో చాలనే ఉన్నాయి. వాటిలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండా పోతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

- ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల ఇష్టారాజ్యం
- సీఎస్ఈ వెబ్‌సైట్‌లో నమోదులో నిర్లక్ష్యం
- ఒకటో తరగతిలో ఉచిత సీట్లు ఇచ్చేందుకు ముందుకు రాని వైనం
- స్కూళ్ల రిజిస్ట్రేషన్‌కు నేటితో ముగుస్తున్న గడువు

విశాఖ విద్య: విద్యాహక్కు చట్టం (12(1)(సీ) అమల్లో భాగంగా 2024–25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు స్కూళ్లలోనూ పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశం పొందేందుకు ప్రభుత్వం షెడ్యూల్ జారీ చేసింది. స్టేట్ సిలబస్‌తో పాటు, ఐబీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ బోధన అమలు చేసే ప్రైవేటు స్కూళ్లలో తప్పనిసరిగా ఒకటో తరగతిలో 25 శాతం మేర సీట్లు పేదలకు ఉచితంగానే ప్రవేశాలు కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది.

నమోదులో నిర్లక్ష్యం

గుర్తింపు ఉన్న ప్రైవేటు స్కూళ్ల వివరాలను కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్(సీఎస్ఈ) వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. కానీ ఈ విషయంలో జిల్లాలోని కొన్ని ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు అంతా మా ఇష్టం అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. ఫిబ్రవరి 23 నాటికే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ కావాల్సి ఉండగా, ప్రైవేటు స్కూళ్ల వారికి మరో అవకాశం కల్పిస్తూ దీనిని మార్చి 1 వరకు పొడిగించారు. గురువారం నాటికి జిల్లాలో ఇంకా 22 స్కూళ్ల నమోదు కాలేదు. ఇందులో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఒక్రిడ్జ్, ప్రెసిడెన్సియల్, సిల్వర్‌ఓక్స్, టింపనీ, పోలాక్స్, శివశివానీ, విశాఖ వ్యాలీ వంటి ప్రైవేటు స్కూళ్లు ఉండటం గమనార్హం. ఇది ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడవటమేనని తల్లిదండ్రులు అంటున్నారు.

వివరాలు సేకరిస్తున్న మండల స్థాయి కమిటీలు

ఉచిత ప్రవేశాలకు ముందుకు రాని స్కూళ్ల వివరాలను మండలాల వారీగా గుర్తించి, వాటిని వెంటనే నమోదు చేయించేలా మండల స్థాయి కమిటీలు పర్యవేక్షణ చేస్తున్నాయి. దీనిపై సీఆర్పీలకు బాధ్యతలు అప్పగించారు. ఇదే క్రమంలో విద్యార్థులకు సంబంధించిన గత బకాయిలను స్కూళ్ల యాజమాన్యాలకు చెల్లించేలా పూర్తి స్థాయిలో వివరాలను సేకరిస్తున్నారు.

స్కూళ్లు అన్నీ నమోదు కావాల్సిందే..



జిల్లాలో 95 శాతానికి పైగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయ్యాయి. నూరుశాతం నమోదు చేసేలా మండల స్థాయి కమిటీలు పర్యవేక్షణ చేస్తున్నాయి. పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇచ్చేలా స్కూళ్లు అన్నీ తప్పనిసరిగా రిజిస్టర్ చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

–ఎల్.చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తాం



ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం మేర పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇవ్వాలి. ఇందుకు నిరాకరించే స్కూళ్ల గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తాం. ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్న యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గొండు సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి సత్కారం

విశాఖ సిటీ: పోలీసు శాఖలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన నలుగురిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ గురువారం సన్మానించారు. ట్రాఫిక్ ఏసీపీ జాన్ మనోహర్, ఆఫీస్ సూపరింటెండెంట్ ఎల్.సత్యారావు, టూ టౌన్ ట్రాఫిక్ స్టేషన్ హెచ్‌సీ జి.శ్రీనివాసరావు, పోలీస్ కంట్రోల్ రూమ్ హెచ్‌సీ వి.కనకప్రసాద్‌లను సీపీ తన కార్యాలయానికి ఆహ్వానించారు. వారి కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారుల సమక్షంలో సత్కరించి వీడ్కోలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఏసీపీ జాన్ మనోహర్ సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. పదవీ విరమణ పొందిన మిగిలిన ముగ్గురు కుటుంబ సభ్యులతో మాట్లాడి పోలీస్ శాఖలో 40 ఏళ్ల సుదీర్ఘ సర్వీస్ చేయడం గొప్ప విషయమన్నారు.

ఓపెన్ పరీక్షలకు 27 మంది ఖైదీలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఈ ఏడాది ఓపెన్ పరీక్షలు రాయడానికి 27 మంది ఖైదీలు సిద్ధమవుతున్నారు. పదో తరగతి ఓపెన్ పరీక్షలు 9 మంది, ఇంటర్మీడియట్ 18 మంది ఓపెన్‌లో పరీక్షలు రాయనున్నట్లు జైల్ అధికారులు తెలిపారు. వీరికి ఈ ఏడాది మార్చి 18 నుంచి ఓపెన్ పరీక్షలు జరగనున్నాయి.

గంజాయి తరలిస్తున్న ఒడిశా మైనర్ అరెస్ట్



జీఆర్పీ స్వాధీనం చేసుకున్న గంజాయి..

తాటిచెట్లపాలెం: గంజాయి తరలిస్తున్న మైనర్‌ను గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ జి.శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.చిట్టిబాబు సిబ్బందితో గురువారం విశాఖ రైల్వేస్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంలలో తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన మైనర్ బ్యాగును తనిఖీ చేయగా.. అందులో 7 కిలోల గంజాయిని గుర్తించారు. అతను రైలులో విశాఖ మీదుగా ముంబయికి గంజాయికి తీసుకెళ్తున్నట్లు విచారణలో అంగీకరించాడు. అతన్ని జువైనల్ హోంకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా చంద్రమౌళి ప్రమాణ స్వీకారం



చంద్రమౌళి

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ నూతన చైర్మన్‌గా సనపల చంద్రమౌళి శుక్రవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. యువజన కాంగ్రెస్‌లో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన చంద్రమౌళి ఆ తరువాత వైఎస్సార్ సీపీ ఆవిర్భావంతో పార్టీలో చేరారు. వార్డు అధ్యక్షుడి స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగారు. పార్టీకి అంకితభావంతో ఆయన చేసిన సేవలు గుర్తించిన పార్టీ అధినాయకత్వం గత ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఆయన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు.

రోజూ టాటానగర్‌-ఎర్నాకుళం బై వీక్లీ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా టాటానగర్‌- ఎర్నాకుళం బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఇకపై ప్రతి రోజూ నడుస్తుందని వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. టాటానగర్‌లో ఈ నెల 7వ తేదీ నుంచి బయల్దేరే టాటానగర్–ఎర్నాకుళం (18189) ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజూ నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 10 నుంచి ఎర్నాకుళం–టాటానగర్(18190) ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజూ బయల్దేరుతుంది. ప్రయాణికుల ఈ సదుపాయాన్ని వినియోగించుకుని సుఖవంతమైన ప్రయాణం సాగించాలని రైల్వే అధికారుల కోరారు.

నృసింహ యజ్ఞం టికెట్ల విక్రయాల ప్రారంభం



తొలి టికెట్‌ను కొనుగోలు చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై ఈనెల 26 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు సుదర్శన నారసింహ మహాయజ్ఞం వైభవంగా నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. యజ్ఞంలో పాల్గొనే ఉభయదాతలు (దంపతులు)కు రూ.3వేల టికెట్టు నిర్ణయించామన్నారు. యజ్ఞం నిర్వహణకు సంబంధించి భక్తులకు పూర్తి వివరాలు తెలియజేసేందుకు సింహగిరిపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమాచార కేంద్రాన్ని గురువారం ఈవో ప్రారంభించారు. అలాగే తొలి టికెట్టును కొనుగోలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 తర్వాత మళ్లీ పెద్ద ఎత్తున మహా యజ్ఞం నిర్వహిస్తున్నామన్నారు. మరో మూడు రోజుల్లో ఆన్‌లైన్‌లో కూడా టికెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గుగుల్‌పే, ఫోన్‌పే ద్వారా కూడా టికెట్లు కొనుగోలు చేసే ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. యజ్ఞాన్ని పురస్కరించుకుని ఈనెల 26నుంచి ఏప్రిల్ 1వరకు సింహగిరిపై ఆర్జిత సేవలన్నీ రద్దు చేసినట్టు దేవస్థానం ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తెలిపారు. దేవస్థానం ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, పెనుమత్స శ్రీదేవివర్మ, సువ్వాడ శ్రీదేవి, దశమంతుల రామలక్ష్మి, ముదుండి రాజేశ్వరి, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు భ్రమరాంబ, పాలూరి నరసింగరావు దేవస్థానంకి విశిష్టతదాతలు బోకం శ్రీనివాస్, సాయికుమార్ పాల్గొన్నారు.

మోదీ నుంచి దేశాన్ని రక్షించుకుందాం..

- రాజ్యాంగ హక్కులకు తూట్లు పొడుస్తున్న బీజేపీ
- రాజ్యాంగ పరిరక్షణ సదస్సులో వక్తల పిలుపు

డాబాగార్డెన్స్: నరేంద్రమోదీ నాయకత్వంలో మతోన్మాద, కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని రక్షించుకుందామని, రాజ్యాంగ హక్కులకు తూట్లు పొడుస్తున్న బీజేపీని, ఆ పార్టీని బలపరుస్తున్న మిగతా పార్టీలను 2024 ఎన్నికల్లో ఓడించాలని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, కిసాన్ సంయుక్త మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాదీశ్వరరావు అధ్యక్షతన డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'బీజేపీకో హటావో/ దేశకో బచావో' నినాదంతో భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణకై గురువారం ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగానికి తీవ్రమైన ప్రమాదం నేడు వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. విభజన చట్టంలో పొందుపరచిన విభజన హామీలను కేంద్ర ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని, ఈ విషయంలో పాలక ప్రతిపక్ష పార్టీలను ప్రజలు ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు మణిశంకర్ అయ్యర్ మాట్లాడుతూ భారతదేశాన్ని బీజేపీ ప్రభుత్వం నుంచి రక్షించుకోవాన్నదే ఇండియన్ ఎలయన్స్ ప్రధాన ధ్యేయమన్నారు. 2024 ఎన్నికల్లో బీజేపీని దేశం నుంచి వెళ్లగొట్టి మళ్లీ లౌకిక ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. స్వరాజ్య పార్టీ జాతీయ నాయకుడు యోగేంద్ర యాదవ్ మాట్లాడుతూ 2024 ఎన్నికలు.. రాజ్యాంగ పరిరక్షణకు జరుగుతున్న ఎన్నికలుగా భావించాలన్నారు. జై భారత్ నేషనల్ పార్టీ జాతీయ కార్యదర్శి జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇటీవల మోదీ ద్వారక సముద్ర గర్భంలో పర్యటించారని, బంగాళాఖాతంలో కూడా ఒకసారి పర్యటిస్తే సముద్ర గర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక విభజన హామీలు, హోదా ఉన్నాయా? లేదా అని తెలుస్తుందన్నారు. 14వ ఫైనాన్స్ కమిషన్ ప్రత్యేక హోదా ఇవ్వొద్దని ఎక్కడా చెప్పలేదని 15వ ఫైనాన్స్ కమిషన్ తెలపడం జరిగిందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి లేదని, రైల్వేజోన్ లేదని, వచ్చే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి సమాధి కట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు శీరం రమేష్, డాక్టర్ సీతల్, సీపీఎం, సీపీఐ నాయకులు ఎం.జగ్గు నాయుడు, ఎం.పైడిరాజు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, సిటూ రాష్ట్ర కార్యదర్శి కేఎం శ్రీనివాసరావు, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి శంకరరావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, మానం ఆంజనేయలు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, అజశర్మ, విమల తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ ఫిల్మ్‌లు తొలగించాల్సిందే...

- సుప్రీంకోర్టు ఆదేశాలు పక్కాగా అమలు
- వారం తర్వాత ప్రత్యేక డ్రైవ్ నిర్వహణ
- నిబంధనలు పాటించకుంటే కేసులు
- ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు

అల్లిపురం: మోటారు వాహనాల చట్టం నిబంధనలు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇకపై నాలుగు చక్రాలు, ఆపై వాహనాలకు గల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌లు తొలగించాలని నగర ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు తెలిపారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఏసీపీ రాజీవ్‌కుమార్‌తో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న లైంగికదాడులు, వేధింపులు, అక్రమ రవాణా, కిడ్నాప్ తదితర నేరాలను అరికట్టేందుకు వాహనాలకు బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. వాహనాల అద్దాలకు ముందు, వెనుక ఎటువంటి ఫిల్మ్‌లు, ఇతర నెట్‌లు, కర్టన్లు అతికించరాదన్నారు. నగరంలో కారు డెకార్స్ షాపులు యాజమాన్యాలు, వాహనాలకు ఫిల్మ్‌లు అంటించే వృత్తిలో ఉన్న వ్యాపారులు ఇక ముందు వాహనాలకు ఎటువంటి ఫిల్మ్‌లు అంటించరాదని విజ్ఞప్తి చేశారు. ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. ఇందుకు వారం రోజులు సమయం ఇస్తున్నామని తెలిపారు. నగర ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తారన్నారు. అప్పటికీ వాహన యజమానులు స్పందించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. రూ.300 వరకు జరిమానా విధిస్తామన్నారు. సమావేశంలో నగరంలో వివిధ స్టేషన్ల సీఐలు పాల్గొన్నారు.

గంభీరంలో అమానుషం

ఆడబిడ్డని పారేసిన కర్కశ తల్లి!



పసికందు మృతదేహం

ఆనందపురం: ఆ చిన్నారి.. ఆడపిల్లగా జన్మించడమే పాపమైంది. పుట్టి పుట్టగానే ఆ బిడ్డను గ్రామ శివారున విడిచి పెట్టి వెళ్లిపోయింది ఓ కర్కశ తల్లి. గుక్కపెట్టి ఏడ్చిన ఆ పసికందు కథ చివరకు విషాదాంతమైంది. ఈ అమానుష ఘటన గంభీరంలో గురువారం వెలుగు చూసింది. గంభీరం గ్రామ శివారున గల ఓ అపార్ట్‌మెంట్‌లో ప్రైవేట్ విద్యా సంస్థ కళాశాలను నిర్వహిస్తోంది. గురువారం ఉదయం కళాశాల ప్రహరీ పక్కన నిర్జీవంగా పడి ఉన్న ఆడ పసికందుని సిబ్బంది గుర్తించి.. పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సీఐ టి.వి.తిరుపతిరావు సిబ్బందితో అక్కడకు చేరుకుని విచారణ జరిపారు. సంఘటన జరిగి ఓ రోజై ఉండొచ్చని భావిస్తున్నారు. పూర్తిగా నెలలు నిండి ప్రసవం అనంతరం బిడ్డను పారేసినట్టు చెబుతున్నారు. ఈ మేరకు పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఈ సంఘటన స్థానికంగా జరిగిందా లేదా ఎవరైనా ఇక్కడకు తెచ్చి పసికందును పడేశారా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. కేసును సీఐ దర్యాప్తు చేస్తున్నారు.

4న మాధవధారలో ఉత్తరాంధ్ర మహిళా దినోత్సవం



సమావేశంలో పాల్గొన్న మహిళా నాయకురాలు

కొమ్మాది: మాధవధారలో ఈ నెల 4న ఉత్తరాంధ్ర మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు డా. బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి తెలిపారు. ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం వేడుకల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వేడుకలకు వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, మంత్రులు విడదల రజిని, ఆర్.కె.రోజా, గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర మహిళా కమిటీ సభ్యులు ముదుండి రాజేశ్వరి, శ్రీదేవి, సాగరిక, రాధ, యువశ్రీ, లక్ష్మి, రామలక్ష్మి, సుశీల, గాయత్రి, మల్లేశ్వరి, భాను తదితరులు పాల్గొన్నారు.

4,523 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా గురువారం తోటగరువు, బాలాజీనగర్, పాత రేసవానిపాలెం, భానోజీనగర్, ప్రసాద్‌గార్డెన్స్, అంబేడ్కర్ కాలనీ, కణితి, జ్ఞానాపురం, నరవ, ముత్యామాంబ, పెందుర్తిలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో మొత్తం 4,523 మందికి వైద్య సేవలందించగా.. ఆరుగురిని ఉన్నత వైద్యం కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. శుక్రవారం పెందుర్తి మండలం వాలిమెరక, పద్మనాభం మండలం మద్దిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు.

కేజీహెచ్‌లో స్ట్రోక్ యూనిట్ ప్రారంభం



న్యూరాలజీ వార్డులో స్ట్రోక్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: కేజీహెచ్‌లో న్యూరాలజీ విభాగంలో గురువారం స్ట్రోక్ యూనిట్ ప్రారంభమైంది. ఆరు పడకలతో ఈ యూనిట్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.గోపి, సీనియర్ న్యూరాలజిస్ట్,విశాంత్రి విభాగాధిపతి డాక్టర్ కె.వేంకటేశ్వర్లు, ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ వై.ప్రభాకరరావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ ప్రాక్టిసింగ్ న్యూరాలజిస్టు డాక్టర్ భాగ్యరేఖ, డాక్టర్లు ప్రదీప్, రోహిత్, సుష్మ, మనోజ్, సతీష్, ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీ తులసీ, ఏడీ శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.62,830
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.57,590
వెండి(కిలో):	రూ.75,700

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం	: రూ.120
బ్రాయిలర్ (లైవ్)	: రూ.140
స్కిన్	: రూ.250
స్కిన్‌లెస్	: రూ.260

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	500.00
విజయనగరం	504.00
శ్రీకాకుళం	504.00

ఎడెక్స్ కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి



సదస్సు ప్రత్యేక సంచికను విడుదల చేస్తున్న జేఎన్‌టీయూ ఉపకులపతి వెంకట సుబ్బయ్య

తగరపువలస: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఎడెక్స్ కోర్సులను ఉపాధ్యాయులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జేఎన్‌టీయూ– విజయనగరం వైస్ చాన్సలర్ కె.వెంకట సుబ్బయ్య అన్నారు. గురువారం భీమిలి మండలం దాకమర్రి రఘు విద్యాసంస్థలలో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సులో ఆయన 3వ వైర్‌లెస్, యాంటినా మైక్రోవేవ్ సింపోజియాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో విలువైన ఎడెక్స్ కోర్సులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. డాక్టర్ పీఎస్ఆర్ చౌదరి మాట్లాడుతూ ఐట్రిపుల్‌ఈ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ సదస్సు నూతన జ్ఞానాన్ని బదలాయింపు చేసుకోవడానికి వేదికగా నిలుస్తుందన్నారు. అమెరికాకు చెందిన రావు ఎస్ కన్సల్టెన్సీ నిర్వాహకుడు సుధాకరరావు, నాసా జేఎల్‌పీ ల్యాబ్స్ ప్రతినిధులు నాసిర్ చాహత్, గౌరంగి గుప్తా, డెస్మండ్, ఆర్.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.11లకే కేజీ రాగి పిండి

మార్చి నెల నుంచి పంపిణీ

తుమ్మపాల: మార్చి నెల నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం, పంచదార, గోధుమపిండితోపాటు రాగి పిండిని కూడా ఇంటింటికీ అందించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. జిల్లాలో 5.5 లక్షల రైస్ కార్డుదారులు వినియోగించుకునేందుకు 330 టన్నుల రాగి పిండిని కమిషనర్ కార్యాలయం నుంచి కేటాయించినట్లు తెలిపారు. రాగి పిండి కేజీ ధర రూ.11లు అన్నారు. కేజీ రాగిపిండిలో 10.8 గ్రాముల ప్రొటీన్లు, 11 గ్రాముల ఫైబర్‌తో పాటు బి, సి, ఇ విటమిన్లు, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్ మినరల్స్ సమృద్ధిగా ఉంటాయన్నారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ ధర రూ.40 లు ఉందన్నారు. రాగి పిండి కావాల్సిన కార్డుదారులు వారికి గల బియ్యం కేటాయింపు నుంచి ఒక కేజీ బియ్యానికి బదులు ఒక కేజీ రాగిపిండి ధర చెల్లించి పొందవచ్చని పేర్కొన్నారు.

ఈవీఎం, స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ

తుమ్మపాల: జిల్లా ఎస్పీ కార్యాలయం సమీపంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ (గొడౌన్)ను గురువారం కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా అక్కడ గల సీల్‌ను, సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు డి.రామ్మూర్తి, డీటీ ఎ.రవిబాబు పాల్గొన్నారు.